క్లుప్తంగా

గిట్టుబాటు ధర కల్పించాలి

సంగారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డి భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అధ్వర్యంలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ రైతులు భూములు అమ్ముకోవద్దని సూచించారు. గ్రామ గ్రామాన సభ్యత్వ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేవరకు ప్రభుత్వాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహిళా నాయకురాలు లావణ్య, రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్: దేశ ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రచారంలో భాగంగా మోదీ గ్యారంటీ ప్రచార వాహనం శుక్రవారం నారాయణఖేడ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వాహన శ్రేణికి ఘన స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమగ్రంగా వివరిస్తూ ముద్రించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, బీజేపీ, బీజేవైఎం నాయకులు సంజీవ్‌పాటిల్, రాజుగౌడ్, పట్నం మాణిక్, సతీష్‌కుమార్, లోకేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యుత్ అందించాలని వినతి

సంగారెడ్డి: ఉల్లి రైతుల కోసం పగలు నిరంతర విద్యుత్ ఇవ్వాలని కోరుతూ విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాస్‌కు రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి యాదవ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అధిక మండలాల్లో రైతులు ఉల్లిసాగు చేస్తున్నారన్నారు. కానీ.. విద్యుత్ సరిగా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పగలు నిరంతరంగా విద్యుత్ అందించాలని కోరారు.

గ్యాస్ సిలిండర్ల పట్టివేత

నారాయణఖేడ్: అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్‌ఇఫ్తికార్, మహ్మద్ షబ్బీర్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు 33 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. పౌర సరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా ఎవరైనా సిలిండర్లను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

రైల్వే బుకింగ్ కౌంటర్ పునఃప్రారంభం

జోగిపేట(అందోల్): జోగిపేటలో రెండేళ్ల క్రితం నుంచి మూసివేసిన రైల్వే బుకింగ్ కౌంటర్‌ను తిరిగి యథావిధిగా సేవలను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రైల్వే బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేసేందుకు మార్కెట్ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్ కృషి చేసిన విషయం తెలిసిందే. రెండేళ్లుగా మూసి ఉన్న కేంద్రాన్ని తిరిగి పునఃప్రారంభించాలని రాష్ట్ర స్థాయి అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందించడంతోనే రైల్వే బుకింగ్ కౌంటర్‌ను పునఃప్రారంభించారని జోగినాథ్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ పుష్ప అన్నారు. బస్తీదర్శన్ కార్యక్రమంలో భాగంగా శ్రీసాయినగర్‌కాలనీలో పర్యటించారు. ఉప కమిషనర్ సురేష్, నాయకులు శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఖోఖో జట్ల ఎంపిక

సంగారెడ్డి: ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సీనియర్స్ (బాలుర) ఖోఖో పోటీలను ఈ నెల 21న శివంపేట్ గ్రామంలో నిర్వహించనున్నట్లు జిల్లా సెక్రెటరీ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్లు వచ్చే నెల 9, 10, 11 తేదీల్లో నల్గొండ జిల్లా భువనగిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. క్రీడాకారులు ఎంపిక స్థలానికి ఉదయం 9 గంటలలోపు హాజరు కావాలని సూచించారు. అదేవిధంగా ఎంపిక విధానం టోర్నమెంట్ కం సెలక్షన్ మాదిరి ఉంటుందని, టీములు 9 గంటల్లోపు రిపోర్ట్ చేయాలని సూచించారు.

కేంద్ర పథకాలపై అవగాహన

జోగిపేట(అందోల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై జోగిపేటలోని క్లాక్ టవర్ వద్ద శుక్రవారం పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రధానమంత్రి వికసిత్ సంకల్ప్‌యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్‌బీఐ మేనేజర్ శ్రావణి, మంజీర గ్రామీణ బ్యాంక్ ఉద్యోగి గిరిబాబు, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణ, హెచ్‌పీ గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం

ఈ నెల 22వ తేదీ వరకు మార్పులు, చేర్పులకు అవకాశం

పటాన్‌చెరు టౌన్: అర్హులైన యువత ఓటరు నమోదు చేసుకోవాలని సూచిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటరు నమోదులో భాగంగా పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు ముగ్గులు పోటీలు నిర్వహించి ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు ఓటరు నమోదులో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, మాస్టర్ అమరేందర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



న్యాల్‌కల్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గడ్డపోతారం పారిశ్రామికవాడలో...

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పారిశ్రామిక వాడల్లోని వివిధ పరిశ్రమల్లోని కార్మికులు, ఉద్యోగులకు తహసీల్దార్ రవికుమార్, ఆర్‌ఐ జయప్రకాశ్‌నారాయణ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అదేవిధంగా బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఓటుహక్కు ప్రాముఖ్యతపై ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి, ఆర్‌ఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని బసంత్‌పూర్-మామిడ్గి గ్రామాల శివారులో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, మిర్జాపూర్(బి)లోని ఓయూ పీజీ కళాశాలలో శుక్రవారం ఓటరు నమోదుపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బానుకిరణ్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జిన్నారం: ఓటరు నమోదులో పాల్గొన్న గడ్డపోతారంలోని పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని నాయబ్ తహసీల్దార్ వీరేశం అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్, ఆర్‌ఐ మొగులయ్య పాల్గొన్నారు.



ఓటుహక్కు ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థినులు వేసిన ముగ్గులు

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

జహీరాబాద్ టౌన్: ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక క్యాంప్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన ఓటరుతో పాటు మార్పులు, చేర్పుల విషయమై ఫారం 6,7,8ల ద్వారా అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైనవారందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో వడ్డెర సంక్షేమ సంఘం మహిళలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తన సొంత నిధులు రూ.3,30లక్షలతో విలువైన 33 కుట్టు మిషన్లను మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెంది ఇతరులకు ఉపాధి కల్పించాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం, రాష్ట్రం, అన్నిరంగాల్లో అభివృద్ధిని సాధిస్తుందన్నారు. సామాజిక సేవలో ఉండే ఆనందం ఎందులోనూ ఉండదని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి తన సొంత నిధులతో కొనుగోలు చేసిన మూడు ఆటోలను యువకులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీశైలం, తెల్లాపూర్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు శ్రీపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వడ్డె నరసింహ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కంది(సంగారెడ్డి): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో వచ్చే నెల 11,12 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండల పరిధిలోని చేర్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సోమశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేపడుతూ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మహాసభలకు ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ కంది మండల అధ్యక్షుడు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్, ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య, ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, సంజీవ్, రాము, నర్సింహులు, శోభ, మహేష్, నాగేంద్ర, జనార్ధన్, సీఆర్పీ విజయ్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

- విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి
- డీపీఎస్ అసోసియేషన్ జాయింట్ డైరెక్టర్ డోలిచాన
- ఘనంగా జాతీయ అర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని డీపీఎస్ అసోసియేషన్ జాయింట్ డైరెక్టర్ డోలిచాన అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలోని కొల్లూర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ అర్చరీ చాంపియన్‌షిప్ పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డోలిచాన మాట్లాడుతూ విద్యార్థి దశలో మానసిక ఒత్తిడిని జయించేవిధంగా క్రీడాపోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు వెలికితీయడంతో పాటు విద్యార్థుల్లో పోటీతత్వం మరింత పెరుగుతుందని వివరించారు. కొల్లూర్ పాఠశాలలో జాతీయ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించడంపై నిర్వాహకులను ఆమె అభినందించారు. అనంతరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ తూమ్‌భీంసేన్ మాట్లాడుతూ క్రీడాపోటీల ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని మరింత ప్రోత్సహిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్మూ, బెంగళూరు, హరిద్వార్, ముంబాయి, అమృత్‌సర్ తదితర ప్రాంతాలకు చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీఎస్ ప్రిన్సిపాల్ వసంత, సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డోలిచాన

మృతుల కుటుంబాలను ఆదుకోండి



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్

సంగారెడ్డి టౌన్: సంక్షేమ గురుకులాల్లో మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఇటీవల రంజోల్ గురుకుల కాలేజీలో మృతి చెందిన విద్యార్థిని బేగరి స్వప్న కుటుంబ సభ్యులతో కలిసి సమతా సైనిక్ దళ్ (ఎస్‌ఎస్‌డీ) కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో కలెక్టర్ వల్లూరు క్రాంతికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ ఇటీవల జహీరాబాద్ మండల పరిధిలోని తూంకుంట గ్రామానికి చెందిన విద్యార్థిని బేగరి స్వప్న రంజోల్ గురుకుల కాలేజీలో ఆత్మహత్య చేసుకుంది. అదేవిధంగా రంజోల్ గ్రామానికి చెందిన విద్యార్థిని ప్రియదర్శిని ఆందోల్ గురుకుల కాలేజీలో చదువుతూ అనారోగ్యంతో మృతి చెందింది. సిర్గాపూర్ గిరిజన గురుకులంలో మరో విద్యార్థిని భవనం నుంచి పడి మృతి చెందిందని గుర్తు చేశారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇందిరమ్మ గృహాలు, మూడెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

స్వప్న కుటుంబాన్ని ఆదుకోవాలి

జహీరాబాద్ టౌన్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రంజోల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల ఇంటర్ విద్యార్థి స్వప్న కుటుంబాన్ని ఆదుకోవాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు కరణం రవికుమార్ కోరారు. మృతురాలి తండ్రి బేగరి రాజుతో కలిసి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వప్నది నిరుపేద కుటుంబమని, మంచి భవిషత్ ఉన్న కూతురు మృతిని ఆమె తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వప్న కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు మూడు ఎకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

విద్యార్థినులు ఉన్నతంగా ఎదగాలి

కోహీర్(జహీరాబాద్): విద్యార్థినులు లింగ వివక్షతను అధిగమించి ఉన్నతంగా ఎదగాలని దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాకీర్ హుసేన్ అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వివిధ అంశాలపై విద్యార్థినులను అవగాహన కల్పించారు. మహిళలు ధైర్యంగా లక్ష్యసాధన వైపు అడుగులు ముందుకు వేయాలన్నారు. ప్రతిఒక్కరికీ బాల్య వివాహాలు, ప్రత్యేక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భార్గవి, విజయలక్ష్మి, సురేష్, గుణవతి, లలిత, మమత, కల్పన, మహేశ్వర్, డాక్టర్ వసంత్‌రాజ్, శివకుమార్, జయరాజ్, అహమద్, హసిబుద్దీన్ వికార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రికవరీలో శ్రద్ధ తీసుకోవాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): సొసైటీ ద్వారా తీసుకున్న ఋణాలను సకాలంలో చెల్లించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని న్యాల్‌కల్ పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ దత్తారెడ్డి, సభ్యులు జానాబాయి, గంగమ్మ, ఈరన్న, జనార్ధన్ రెడ్డి, సొసైటీ సిబ్బంది బస్వరాజ్ పాల్గొన్నారు.

అసంపూర్తి కూల్చివేతలపై అనుమానాలు..!

- అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా నిర్మాణాలు
- అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం
- అక్రమ నిర్మాణాలను పూర్తిగా కూల్చివేయించాలని డిమాండ్

జిన్నారం(పటాన్‌చెరు): రైతులు పంటలను సాగు చేసేందుకు గతంలో అసైన్డ్ భూములను కేటాయించారు. ఆరు నెలల క్రితం రైతులకు అధికారులు భూములకు సంబంధించిన పట్టాలను కూడా అందించారు. అయినప్పటికీ ఈ భూముల్లో కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నామమాత్రపు చర్యలు తీసుకొని చేతులు దులుపుకున్నారు.

గుమ్మడిదల మండలం..అన్నారం గ్రామంలోని 261 సర్వే నెంబర్‌లోని అసైన్డ్ భూములను సాగు చేసుకునేందుకు గతంలో ప్రభుత్వం రైతులకు కేటాయించింది. తాజాగా ఈ భూములపై కొంతమంది అక్రమార్కుల కన్ను పడింది. ఈ భూముల్లో నిర్మాణాలు చేపడితే సొమ్ము చేసుకోవచ్చని అక్రమార్కులు రైతులకు ఆశ చూపించారు. దీంతో నెల రోజుల నుంచి రైతులకు కేటాయించిన అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఏకంగా వెంచర్‌ను ఏర్పాటు చేసి గుంట భూమిని రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు విక్రయిస్తున్నారంటే ఇక్కడ ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాన్ని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. కొంతమంది నేరుగా కలెక్టర్, ఆర్డీవోకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన తహసీల్దార్, ఇటీవల ఆర్‌ఐలు నిర్మాణాలను పరిశీలించి అక్రమ నిర్మాణాలను రెండు రోజుల క్రితం కూల్చివేయించారు. వీటిలో 10 అక్రమ నిర్మాణాలు ఉండగా ఐదు నిర్మాణాలను మాత్రమే అధికారులు నామమాత్రంగా కూల్చివేయించారు. అసంపూర్తిగా కూల్చివేతలు చేపట్టడంతో గ్రామస్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, అక్రమార్కుల కనుసన్నల్లోనే ఈ తతంగం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అన్ని నిర్మాణాలను పూర్తిగా కూల్చివేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అసైన్డ్ భూమిలో ప్లాట్ల కోసం ఏర్పాటు చేసిన హద్దు రాయి

కఠిన చర్యలు తప్పవు

అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే కొన్ని నిర్మాణాలు కూల్చివేయించాం. మరిన్ని నిర్మాణాలను త్వరలోనే కూల్చివేయించేవిధంగా చర్యలు తీసుకుంటాం. 261 సర్వేనంబర్‌లోని అసైన్డ్ భూములపై నిఘా ఉంటుంది.

– గంగాభవాని, తహసీల్దార్, గుమ్మడిదల

అధిక సాంద్రత పద్ధతితో దిగుబడి

సంగారెడ్డి: అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి వస్తుందని సంగుపేట ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ అన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు క్షేత్ర దినోత్సవాన్ని చౌటకురు రైతువేదికలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతి సాగుపై అవగాహన కల్పించారు. స్పెషల్ కాటన్ ప్రాజెక్టు, సీడ్స్‌లో (విన్నర్, సిరి, ఆర్మిత్ర) సంబంధింత పత్తి వంగడాలు, వాటి ఉత్పాదక, పత్తి బరువు, మొక్కల లక్షణాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ అరుణ, ఏఓ చైతన్య, ఏఈఓలు ప్రవీణ్, రాజశేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీవైజేఎఫ్ అధ్యక్షుడిగా జానారెడ్డి

జహీరాబాద్ టౌన్: తెలంగాణ యూత్ జర్నలిస్టు ఫెడరేషన్(టీవైజేఎఫ్) జహీరాబాద్ అధ్యక్షుడిగా జానారెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలో టీవైజేఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఖలీల్, కోశాధికారిగా చంద్రకళను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ షేక్ మహబూబ్, కోశాధికారి మఠం మమత, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మడపతి రాజశేఖర్, కోశాధికారి చింత శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు సంగీత, పటాన్‌చెరు మండల అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిడిపూతను కాపాడుకోవాలి

జహీరాబాద్: మామిడి పూతను రైతులు కాపాడుకోవాలని ఉద్యానవన అధికారి శైలజ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత అన్నారు. మండల పరిధిలోని రంజోల్ గ్రామ రైతు వేదికలో మామిడిపూతను ఏవిధంగా కాపాడుకోవాలి అనే అంశంపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి పూతదశలో ఉన్నందునా అధికారుల సూచనల మేరకు మెలకువలు పాటించాలని రైతులు సూచించారు. అనంతరం ఉద్యానశాఖ ద్వారా చేపట్టే వివిధ రాయితీ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, ఏఈఓ ప్రదీప్‌కుమార్, రైతులు అఫ్జల్ మియా, బాబు, ప్రతాప్‌రెడ్డి, కృష్ణ, జగన్, రాములు, ఉద్యాన కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మునిపల్లి(అందోల్): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వైద్యం, ఆరోగ్యం, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శోభ, రజిత, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కూతురు అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: డీమార్ట్‌లో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన నర్సింహులు కూతురు హరిత లింగంపల్లి సమీపంలోని నలగండ్ల డీమార్ట్‌లో పనిచేస్తోంది. ఈ క్రమంలో 18వ తేదీ ఉదయం డీమార్ట్‌లో ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్లిన హరిత తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. హరిత కోసం ఆమె కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించపోవడంతో కూతురు అదృశ్యంపై ఆమె తండ్రి నర్సింహులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలి

సంగారెడ్డి: విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని వాసవీ మా ఇల్లు అధ్యక్షుడు టోపాజి అనంత కిషన్ అన్నారు. వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో సంగారెడ్డి తార ప్రభుత్వ కళాశాలలో లైఫ్ సైన్స్‌పై రెండు రోజుల పాటు జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్‌లోని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజకుమార్ వీరప్ప, తారా డిగ్రీ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నితిన్‌కుమార్, రాథోడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుగుణదేవి, రమేష్‌బాబు, వాసవీ మా ఇల్లు ఉపాధ్యక్షుడు మేడం రాధాకిషన్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, విద్యాసాగర్, కృష్ణమూర్తి, మనోహర్, భాస్కర్, భాస్కర్, సుధాకర్, మూర్తి, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.